నిర్మాతలు చేతులుకట్టుకు కూర్చోవలసి వస్తుంది. మన దేశానికి దిగుమతి అయే ముడిఫిల్ము నిర్మాతల ధనంతోను, పలుకుబడితోను నిమిత్తం లేకుండా, ఉత్సాహవంతులైన నిర్మాతలందరికీ వారికి కావలసిన చిత్రాలకు ఫిల్ము పొడవును నిబంధించి సరఫరా చేయటం ఉత్తమం. ఇటువంటి పద్ధతిని ప్రభుత్వం అమలులో పెట్టిన నాడు నిర్మాతలందరికీ న్యాయం జరగడమే కాకుండా ఎక్కువ చిత్రాలు తయారవటానికి అవకాశం వుంది.

మనకు విదేశాలనుంచి వచ్చే చిత్రాలన్నీ చాలామట్టుకు 10,000 అడుగులు 12,000 అడుగులకూ మించి వుండవు. ఆ ప్రజలు వారి కాలాన్ని అతివేగంగా నడిచే వ్యాపారాలలో నాగరికతలో, పనులలో వినియోగించటానికే సరిపోతుంది. వారికి గంటలకొద్దీ సినిమాలు చూడటానికి అవకాశం వుండదు. మన దేశంలోగూడా కాలం యొక్క విలువ అధికమవుతోంది. సోమరిపోతులు, ఇతరుల ఆదాయం మీద ఆధారపడి బ్రతికేవారు తగ్గిపోతున్నారు. వారికున్న కొద్ది కాలంలోనూ వినోదించటానికి యీ రోజుల్లో తయారయే చిత్రాలు పనికిరావు. మన చిత్రాలుగూడా 12,000, 13,000 అడుగులకు మించకుండా తీయటం చాలా అవసరం. మన నిర్మాతలు కాలాన్ని బట్టి మారాలి. ప్రేక్షకుల డబ్బును దోచుకున్నా వారి కాలాన్ని కూడా దోచుకోగూడదు.

మనకు యింతవరకూ వచ్చిన అన్ని చిత్రాలు యించుమించుగా చాలా పెద్దవి. మనకు యీనాడు చిన్న చిత్రాలని చెప్పుకో తగ్గవి 15000 అడుగుల ఫిల్ములే. బాలనాగమ్మ దగ్గరనుంచి శ్రీలక్ష్మమ్మదాకా మనం యీ విషయంలో ఏమీ కొత్తదనం చూపించలేదు. కొత్తదనం అంటేనే భయం. చిన్న చిత్రాలు, ప్రేక్షకులకు కావలసినవి తీయటం అంటే నిర్మాతలకు అసలే యిష్టం లేదు. 19,000 అడుగుల చిత్రాన్ని సృష్టించి, దానికి మరొక లక్ష అడుగుల ముడిఫిల్మును దండుగ చేస్తేనే గాని నిర్మాతల, దర్శకుల సరదా తీరదు. నిర్మాతల సరదాకోసం తీసుకున్న చిత్రాలు నిర్మాతలే చూసుకోవటం మంచిది.

ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం కలుగజేసుకొని 13,000 అడుగులకు మించని చిత్రాలు తయారయేటట్టు చూడాలి. ప్రభుత్వం యిదివరలో 11,000 అడుగులకు తగ్గించుదామని ప్రయత్నించింది. ఒకేసారి అంతగా తక్కువచేస్తే నిర్మాతలల్లో అసంతృప్తి ఎక్కువగా బలుదేరుతుంది. వాసన్ వంటి నిర్మాతలను సంతోష పెట్టటానికి చూస్తే యీనాటి ప్రభుత్వం, ఒక్కసారే 11,000 అడుగులకు తగ్గించకుండా, 13,000 అడుగుల చిత్రనిర్మాణాన్ని నిర్ణయించటం ఎంతైనా అవసరం.

"సుబుద్ధి"

స్కెచ్

# సినిమా సందర్శనం

అవసరాల రామకృష్ణారావు

మూడు రోజులబట్టి సామాను సద్దుకోడంతోనూ, యీ పిల్లలతోనూ ప్రాణం విసిగిపోయింది. సినిమాకు వెడితే కాస్త హాయిగా వుంటుందని ఆయన అన్నారు. నేనొక్కర్తెనూ వెళ్లలేక మా ప్రక్కింటి సావిత్రిగారు వస్తుందేమోనని వెళ్లేను. మేము ఆ యింట్లో దిగి మూడు రోజులే అవడంవల్ల ఆవిడ ఎలాంటిదో నే నెరుగను. ఈ సినిమా అవకాశం పురస్కరించుకొని ఆవిడతో మాట్లాడదామని వెళ్లేను.

ఇల్లు చిన్నదైనా చక్కగా పొందికగా అలంకరింపబడివుంది. నే వెళ్లేసరికి ఆవిడ పడుకునుంది. సాయంత్రం అయిదింటికి యీ పడకేమిటా అనుకుంటుండగా ఆవిడ లేచి 'రండమ్మా, రండి' అని ఆహ్వానించింది - లేచి చాపవేసింది; యిద్దరం కూర్చున్నాం.

'పడుకున్నారేం?' అన్నాను గదంతా కలియ చూస్తూ. 'ఏమీ లేదమ్మా, తలనెప్పిగా' ఉందని పడుకున్నాను.' ఆవిడ ఎంత కప్పిపుచ్చుదామనుకున్నా విసుపుతో కోపంతో వున్న మొహం, రేగిన వెంట్రుకలూ, చెదరిన కుంకుమ - అనకూడదుగాని నాకు చటుక్కున సత్యభామ జ్ఞాపకం వచ్చింది.

ఆవిడ చటుక్కున ప్లేటు మార్చేసి,

'మీకు మా యిల్లేమైనా సదుపాయంగా ఉందా?' అంది.

'మా కన్నివిధాలా సదుపాయంగానే ఉందండీ, ఇంతకీ అన్నగారికి పనేమిటో?' అన్నాను.

'నాకు యిదే పని!' అన్నటు ఓ చేతిలో గరిటా మరోచేతిలో గిన్నె పట్టుకుని వంటవాడు కాబోలు, ఆమె దగ్గరకువచ్చి నన్ను చూసి సందేహించి, అయినా తెగించి 'ఏమే!...' ఇదేమిటి? మబ్బులేనివాన! వానలేనివరద! అతడు ఏమేఁ అని సంబోధించకపోతే నేను వంటవాడే అనుకొని ఉందును! ఇతడు-యీమె-భర్తా?

'ఏమే, గోరు చిక్కుడుకాయి పులుసూ ఆవాపెట్టి వండమన్నావా, నువ్వులుగుండ జల్లమన్నావా?' అన్నాడు తడుముకోకుండా—నా జేబు రుమాలే ఆవకట్టలా పనిచెయ్యకపోతే నా నవ్వుల నది నిముషంలో రొదలతో యివతల పడి ఉండును. క్షణంలో సావిత్రిగారి మొహం ఎఱ్ఱబడిపోయింది. ఆమె కనుబొమ్మలు రెండూ అప్రియంగా కలుసుకున్నాయ్, ఆమె మూతి శంఖాకృతి దాల్చింది.

'మీ యిష్టం వచ్చినట్లు తగులడండి! అక్కడికి మహారోజా ఆఘోరిస్తున్నట్టు-' అతడు వణికిపోతున్నాడు...

'అదేమిటే చిన్నదగకుండా ఎప్పుడేనా...'

ఆమె మధ్యలో ఆపేసింది, యిటువైపు తిరిగి 'చూడండి ఒదినగారూ, తెలిసినవారు మీరు కాబట్టి సరిపోయింది, మనలో మనం ఎలాగేనా సద్దుకుంటాం......పైవాళ్లు వింటే ఏం బాగుంటుంది చెప్పండి? ఎప్పుడేనా మరో బాధగా ఉండి భరించలేక వండమంటావా నలుగురి మధ్యకి వచ్చి- యిదీ వరస... ఇంతకీ మా పెద్దనాన్న బావమరది కొడుకు, మహాబుద్ధిమంతుడు-వాడు పోబట్టి, నేను యిలా కృశించి మంచానికి బల్లిలా అంటుకుపోబట్టి మీ యిష్టం వచ్చినట్టు ఆడిస్తున్నారు-ఆడించండి! ఎన్నాళ్లసాగుతుందో' ఆమె స్థాయి హెచ్చించి కళ్లు చేతులతో మూసేసుకుంది గాని అతని కళ్లల్లోకి నిజంగా నీరువచ్చేసింది. అమాంతంగా అంటుచేత్తో ఆమె గెడ్డం పట్టుకున్నాడు.

నాకక్కడ వుండడానికే సిగ్గేసి లేచి నిలబడితే, ఆవిడ నాచెయ్యి పట్టుకు కూర్చోబెట్టి,

'వెళ్ళిపోకండమ్మా, మీ అన్నగారికి బుద్ధి వచ్చేటట్టు నాలుగు చివాట్లుపెట్టి మరీ వెళ్లండి' అంది. చచ్చాంరా భగవంతుడా యిదెక్కడి బాధ అనుకొని.

'వెళ్ళి మీపని చూసుకోండి, యిలా మధ్యకు రాకండి బాగుండదు-' అని అతికష్టంమీద అంటే ఆయన పాపం బిక్కమొహంతో నిష్క్రమించాడు.

ఇంతట్లో ఆయన మళ్ళీ వచ్చి-

'వంటయింది - రావచ్చు' అన్నాడు.

'ఊహూఁ నేను చచ్చినా తినను...వెధవ మెతుకులు. అవి రెండూ కొరకకపోతే యీ జీవుడు వెళ్లకపోతుందా?' అంది విసురుగా.

'అంతకోపముంటే ఎలాగే? నాకు తెలిసింది కాదు'...అని అతడు ప్రాధేయపడుతూంటే.

'వస్తానండీ!' అని నేను లేచాను. నేను వెళుతూంటే యిలావినిపించాయి.

'ఎందుకూ, ఎంత సర్వీసుంటే ఏంలాభం!-జ్ఞానంలేనప్పుడు - వెధవకనువు వెళ్లకపోతుందా? మీరూ మీ అబ్బాయీ పెట్టుకుతినండి - నాకవసరంలేదు. అబ్బబ్బబ్బ మీకుచెప్పలేక నా నాలిక తడారిపోతుంది! ఇంటికి ఓమనిషొచ్చినా నదురూ బెదురూ లేదు. ఈ శరీరం లేదనుకుంటే యీ బాధలే ఉండవు, కాని, యీ ప్రాణం వున్నన్నాళ్ళూ యీ చాకిరీ తప్పదు. పదండి మీకోసమేనా యింత మజ్జిగాన్నం పిసుక్కు తింటాను.

నేను యింటికి వెళ్లేసరికి ఆయన మా రెండో వాడికి అన్నం తినిపిస్తున్నారు. నన్ను చూసి గతుక్కుమని,

'అదేమిటి మంజూ, సినిమాకు వెళ్లలే?' అన్నారు.

'వెళ్లే వస్తున్నాను, చిన్న షో. అయిపోయింది!' అన్నాను అప్రయత్నంగా-ఆయన వాచీచూసి.

'అదేమిటి? ఎనిమిదికే అయిపోయిందా?' అన్నారు. నేను నవ్వుతూ, 'అదేనండీ వెళ్లినంత పనీ అయింది!' అన్నాను.